I

సాక్షి
మహబూబాబాద్

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025

నేడు బీసీ రాజకీయ యుద్ధభేరి..



హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీ గ్రౌండ్‌లో నేడు (ఆదివారం) మధ్యాహ్నం 2 గంటలకు బీసీ రాజకీయ యుద్ధభేరి బహిరంగ సభ జరగనుంది. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, 'కుడా' మాజీ చైర్మన్, టీచర్స్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సుందర్‌రాజు యాదవ్ ఆధ్వర్యంలో ఈ సభ ఏర్పాటు చేశారు. పలువురు బీసీ సంఘాల జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరుకానున్నారు.

- వివరాలు IIలో ▸

న్యూస్‌రీల్

గవర్నర్‌ను కలిసిన హుస్సేన్‌నాయక్



మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్‌లో రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనుల సమస్యలు పరిష్కరించి, అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీరాంనాయక్



మహబూబాబాద్ అర్బన్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి గుగులోతు దేశీరాం నాయక్ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని ముత్యాలమ్మగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు ప్రణాళికాబద్ధంగా విద్యార్థులకు బోధించాలన్నారు. ఈ సమావేశంలో ఏటీడీఓ భాస్కర్, ఏసీఎం రాములు, డిప్యూటీ డీఈఓ సారయ్య, మేనేజర్ దేవ్, ఏఓ కృష్ణఅర్జున్‌రావు, జీసీడీఓ విజయ, హెచ్‌ఎంలు కోటీశ్వరి, నర్సయ్య, కిషన్ నాయక్, లలిత కుమారి, సక్రు, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

మహబూబాబాద్: దివ్యాంగులకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక పునరావాస పథకంలో భాగంగా జీవనోపాధి, స్వయం ఉపాధి, కుటీర పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి ఎం. దనమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు గడువు ఈ నెల 2 నుంచి 12వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. వందశాతం రాయితీతో జిల్లాకు 21 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- డీఎంహెచ్‌ఓ మురళీధర్



దంతాలపల్లి: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ మురళీధర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని గదులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చైతన్య, కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతాద్రిలో హైకోర్టు జడ్జి పూజలు



మహబూబాబాద్ రూరల్ : హైకోర్టు జడ్జి జస్టిస్ సూరిపల్లి నంద కుటుంబ సమేతంగా అనంతాద్రి జగన్నాథ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న జస్టిస్ నంద, కుటుంబ సభ్యులకు ప్రధాన అర్చకుడు గొడవర్తి చక్రధరాచార్యులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం వేద ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, ఆర్డీఓ కృష్ణవేణి, తహసీల్దార్ భగవాన్ రెడ్డి, డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపిక పాల్గొన్నారు. అలాగే హైకోర్టు జడ్జి సూరెపల్లి నందను జిల్లా న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, జిల్లా కోర్టు ముఖ్య పరిపాలన అధికారి ఎం.క్రాంతికుమార్, సూపరింటెండెంట్ అమరేందర్, తదితరులు ఉన్నారు.

రూపాయి విదల్చలే..!

కేంద్ర బడ్జెట్‌లో ఓరుగల్లుకు మొండిచెయ్యి

- ట్రైబల్ యూనివర్సిటీ, కోచ్‌ఫ్యాక్టరీ ఊసేలేదు.. కీలక ప్రాజెక్టుల ప్రస్తావనే రాలేదు
- రైతులు, మధ్యతరగతి జీవులకు పథకాలు.. గిగ్ వర్కర్లకు భరోసా
- క్యాన్సర్ మందులు, ఎలక్ట్రానిక్ వస్తువులు చౌక
- ధూమపాన ప్రియులకు షాక్.. వేతన జీవులకు భారీ ఊరట
- మొత్తంగా నిర్మలమ్మ బడ్జెట్‌పై పెదవి విరుపు



2025–26 కేంద్ర బడ్జెట్ ఊరించి.. ఉసూరుమనిపించింది. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్‌కు నేరుగా పద్దులేవీ ప్రకటించలేదు. పేదలు, యువత, రైతులు, మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యంతో ఈ బడ్జెట్‌ను రూపకల్పన చేసినట్లు చెప్పినా.. నేరుగా ఆ వర్గాలకు చెందిన అందరికీ మేలు జరిగే పరిస్థితి కనిపించలేదు. వేతన జీవులకు ఊరట లభించగా.. ధూమపాన ప్రియులపై ధరల పిడుగు పడింది. – సాక్షిప్రతినిధి, వరంగల్

ఓరుగల్లుకు దక్కని నిధులు..

రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తామని ఓరుగల్లును ప్రచారం చేస్తున్నా ఈ బడ్జెట్‌లో నిధుల వాటా దక్కలేదు. ములుగు ట్రైబల్ యూనివర్సిటీ, వరంగల్ నగరంలో నియో రైలు, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, ఎయిర్‌పోర్టు తదితర ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని చేసిన రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులను కేంద్రం పట్టించుకోలేదు. ఈ ప్రతిష్టాత్మక పథకాలకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు జరగకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. కాజీపేట రైల్వే కోచ్‌ను నేరుగా పద్దుల్లో చేర్చకపోవడం వల్ల ఈ ఏడాది అది పూర్తవుతుందనే నమ్మకమే లేకుండా పోయింది. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు రూ.350 కోట్లు ఇవ్వాలని చేసిన ప్రతిపాదనలు బుట్టదాఖలే అయ్యింది. లెదర్‌పార్కు, సైనిక్‌స్కూల్, పథకాల కోసం చేసిన ప్రతిపాదనలను పట్టించుకోకపోగా.. రూ.4,174 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ మాటెత్తలేదు.

వేతన జీవులకు భారీ ఊరట..



ఈసారి బడ్జెట్‌లో వేతన జీవులకు భారీ ఊరట కల్పించారు. రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను నుంచి మినహాయింపు కల్పించారు. రూ.12 లక్షలకు మించి ఆదాయం ఉన్నవారికి స్లాబులవారీగా పన్నులు నిర్ణయించారు. రూ.20 లక్షల నుంచి రూ.24 లక్షల వరకు 25 శాతం పన్నుగా నిర్ణయించారు. రూ.16 లక్షల నుంచి 20లక్షల్లోపు ఆదాయంపై 20 శాతం పన్నుగా నిర్ణయించారు. ఈ నిర్ణయం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో పన్నులు చెల్లించే 24,950 ఉద్యోగులు, సుమారు 35 వేల మంది వ్యాపార, వాణిజ్య, ఇతర వర్గాలకు చెందిన వారికి ఊరట కలగనుంది.

పింక్ బుక్ వస్తేనే రైల్వే బడ్జెట్ తేలేది



సాధారణ బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లా నిధుల వాటా ఇలా ఉంటే.. పింక్ బుక్ విడుదలైతేనే రైల్వే శాఖకు కేటాయింపులు తేలనున్నాయి. మణుగూరు – రామగుండం రైల్వేలైన్ సర్వే కోసం బడ్జెట్ కేటాయించిన కేంద్రంలో భూసేకరణ, నిర్మాణం కోసం నిధులు ఇచ్చారా? లేదా?.. మంజూరైన హసన్‌పర్తి – కరీంనగర్, డోర్నకల్ – మిర్యాలగూడ రైల్వేలైన్ల సర్వే, భూసేకరణ, నిర్మాణం కోసం చేసిన కేటాయింపులు ఎంత? అన్న లెక్కలు తేలనున్నాయి. అత్యంత ప్రతిష్టాత్మకమైన రైల్వే కోచ్‌ఫ్యాక్టరీకి ఏ మేరకు నిధులిచ్చారు? కాజీపేట రైల్వే టౌన్ స్టేషన్, రైల్వే ఆస్పత్రిని సబ్ డివిజన్ ఆస్పత్రిగా మార్చడంపై ఇంకా ఆశలు ఉన్నాయి. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి సూర్యాపేట వరకు కొత్త లైన్, కాజీపేట జంక్షన్ నుంచి ముంబయి. విజయవాడ, కాగజ్‌నగర్ వరకు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించడంతో పాటు ఉమ్మడి వరంగల్‌లో పలు అంశాలకు పింక్‌బుక్‌లో ఊరట లభిస్తుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

వైద్య ఆరోగ్య రాయితీలు.. పర్యాటక ప్రాంతాలకు నిధులు..



దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లు, 200 జిల్లాల్లో క్యాన్సర్ కేంద్రాల ఏర్పాటుతో పాటు 36 ఔషధాలకు బేసిక్ కస్టమ్స్ డ్యూటీ తొలగించి వైద్యం, ఆరోగ్యపరంగా పేదలకు రాయితీలు ఇచ్చారు. క్యాన్సర్ పేషెంట్లకు సరఫరా చేసే మందుల ధరలు తగ్గనుండగా.. ఉమ్మడి వరంగల్‌లో 23,190 మందికి నెలనెలా ఖర్చులు తగ్గనున్నాయి. పర్యాటక ప్రాంతాలకు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి 22 పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో రామప్ప, లక్నవరం, పాకాల, వరంగల్ పర్యాటక ప్రాంతాలకు కూడా ప్రాధాన్యం ఉంటుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

రైతులు, మధ్యతరగతి ప్రజలకు ఓదార్పు...

రైతులు, మధ్యతరగతి ప్రజలకు కొత్తపథకాలను ప్రకటించి ఆ వర్గాలకు బడ్జెట్‌పై ఓదార్పునిచ్చింది. వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యం పేరిట రైతుల ఆదాయాన్ని పెంచడానికి వంద జిల్లాలను ఎంపిక చేసి వ్యవసాయంలో అధునాతన పద్ధతులను అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ములుగు, జేఎస్ భూపాలపల్లి జిల్లాల్లో ప్రయోగాత్మకంగా గతేడాది పలు కార్యక్రమాలు చేపట్టారు. పప్పు ధాన్యాల ఉత్పత్తికి స్వయం సమృద్ధి పథకం అమలు చేస్తున్నారు. ఈసారి రైతుల నుంచి నేరుగా కంది, మినుములు, మసూర్‌లను కేంద్రం కొనుగోలు చేయనుంది. కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం మూలాన ఉమ్మడి జిల్లాలో 8.21 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. గిగ్ వర్కర్లు, వీధివ్యాపారుల సంక్షేమం కోసం ఈ సారి బడ్జెట్‌లో ప్రత్యేక చోటు కల్పించింది కేంద్ర ప్రభుత్వం. ఆరోగ్య సంరక్షణ, ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాలను పొందేందుకు వీలుగా కొత్తగా సంక్షేమ పథకం ప్రతిపాదించింది. ఇందుకోసం గుర్తింపు కార్డులు జారీ చేయనుంది. పట్టణాలు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో పనిచేసే గిగ్ కార్మికులు ఈ–శ్రమ్ పోర్టల్ ద్వారా ఈ ఐడీ కార్డుల కోసం నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి వరంగల్‌లో 7.19 లక్షల మందికి ప్రయోజనం కలగనుంది. రూ.30 వేల పరిమితితో పట్టణ పేదల కోసం యూపీఐ లింక్ క్రెడిట్ కార్డులు కూడా అందించనుంది.

వికసిత్ భారతా? వికసిత్ బీహారా?..



కేంద్రబడ్జెట్‌లో ఈసారి వరంగల్‌కు మొండి చెయ్యే. తెలంగాణకు స్పెసిఫిక్‌గా బడ్జెట్‌లో ఇచ్చిందేమీ కనిపించలేదు. ప్రతీ పథకానికి ఓ అందమైన పేరు పెట్టి ఆకట్టుకునే ప్రయత్నం చేశారే గానీ, తెలంగాణకు, అందులో ఉమ్మడి వరంగల్ ఏమీ ఇవ్వలేదు. మొత్తంగా బడ్జెట్ కేటాయింపులు చూస్తే కేంద్రం వికసిత భారత్ లక్ష్యంగా పని చేస్తుందా, లేక వికసిత బిహార్ లక్ష్యంగా పని చేస్తుందా అనిపిస్తోంది.

– కడియం కావ్య, ఎంపీ, వరంగల్

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు - IIలో ▸

విధులకు ఆటంకం కలిగిస్తున్నారు..

- ఎమ్మెల్యే ఎదుట ప్రిన్సిపాల్ కంటతడి
- ఫుడ్‌పాయిజన్ ఘటనపై ఆరా



హాస్టల్‌లో ఎమ్మెల్యే ఎదుట కంటతడి పెడుతున్న ప్రిన్సిపాల్ సుజాత

కేసముద్రం: సక్రమంగా విధులు నిర్వహిస్తున్నా.. తమను కొంతమంది వ్యక్తులు ఇబ్బందులకు గురిచేస్తూ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఎమ్మెల్యే మురళీనాయక్ ఎదుట ప్రిన్సిపాల్ సుజాత కంటతడి పెట్టిన సంఘటన కేసముద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి... హాస్టల్‌లో హలావత్ సంజన అనే 6వ తరగతి విద్యార్థిని గత నెల 28న ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురై మానుకోట జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో శనివారం ఎమ్మెల్యే గిరిజన గురుకుల బాలికల హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ విద్యార్థిని ఇంటివద్ద నుంచి తెచ్చుకున్న చికెన్ తినడంతోనే వాంతులు అయ్యాయని, దీనిని పెద్దదిగా చేసి కొందరు వ్యక్తులు హాస్టల్ గురించి పైఅధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. గతంలో కూడా పలుమార్లు ఇదేవిధంగా ఇబ్బందులు పెట్టిన సందర్భాలున్నాయని కంటతడి పెట్టుకుంది. ఇలాగైతే తాము విధులు నిర్వర్తించలేమని వాపోయింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కొంతమంది సొంతలాభం కోసం ఉపాధ్యాయులను బ్లాక్‌మెయిల్ చేస్తే సహించేది లేదన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. వంట గది, గదిలో నిల్వ ఉన్న బియ్యం, పప్పులు, కూరగాయలను పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, ప్రాంతీయ అథారిటీ సభ్యుడు రావుల మురళీ, బండారు వెంకన్న, తరాల వీరేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కెపాసిటర్లు బిగించుకోవాలి

మహబూబాబాద్ రూరల్: విద్యుత్ పంపుసెట్ల వద్ద కెపాసిటర్లు బిగించుకోవాలని విద్యుత్‌శాఖ డీఈ పి.విజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని గడ్డిగూడెంతండాలో పొలంబాట నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడారు. అధిక లోడు నివారణకు రైతులు కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఇన్‌చార్జ్ ఏఈ పీక వెంకటేష్, సబ్ ఇంజనీర్ వెంకటేష్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు వీరభద్రం, రత్నంరాజు, లైన్ మెన్ శ్రీనివాస్, ఏఎల్‌ఎంలు సాగర్, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: శాసన మండలి ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలపై ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న స్క్రూటీనీ, 13 లోపు ఉపసంహరణ, 27న పోలింగ్, మార్చి 3న ఫలితాలు ఉంటాయన్నారు. వీసీలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయులకు సంబంధించి 16 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 1,658 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారి, జెడ్పీ సీఈఓ పురుషోత్తం, ఆర్డీఓ కృష్ణవేణి, హరిప్రసాద్, సుబ్బారావు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్

హైకోర్టు జడ్జి జస్టిస్ సూరిపల్లి నంద శనివారం జిల్లా పర్యటనకు రాగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

జీపీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు త్వరలోనే నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు ఎన్నికల వ్యయ పరిశీలనకు అవసరమైన బృందాలు ఏర్పాటు చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మచారి, డీపీఓ హరిప్రసాద్, సీపీఓ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు అస్వస్థత!



మానుకోట జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

కేసముద్రం: నలుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటన మండలంలోని మహముద్‌పట్నంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కేజీబీవీలో చదువుతున్న సిరి, అంజలి, అఖిల, అనూష అనే విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంతో ఉపాధ్యాయులు 108లో మానుకోట జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెట్లపైనుంచి జారి పడటంతో ఒకరు, కిడ్నీ, కడుపు నొప్పితో మరో ముగ్గురు విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఒకేసారి నలుగురు విద్యార్థినులు ఆస్పత్రికి తరలించారనే సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న డీఈఓ రవీందర్‌రెడ్డి, ఎస్సై మురళీధర్‌రావు పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. వేర్వేరు కారణాలతోనే అస్వస్థతకు గురయ్యారని, ఫుడ్‌పాయిజన్ కాలేదని విద్యార్థినుల తల్లిదండ్రులకు నచ్చజెప్పి పంపించారు.

కేసీఆర్ పాలనకే ప్రజల మద్దతు



బాధిత కుటుంబ సభ్యులతో సత్యవతిరాథోడ్

డోర్నకల్: ప్రజలు కేసీఆర్ పాలనకే మద్దతు తెలుపుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ తెలిపారు. డోర్నకల్‌లో శనివారం విలేకరులతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పాలన మాటలకే పరిమితమైందని, నాలుగు హామీలు కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. అనంతరం చాప్లాతండాలో ఇటీవల మృతి చెందిన గుగులోత్ బద్యానాయక్ కుటుంబాన్ని సత్యావతిరాథోడ్ పరామర్శించారు.

పోలీసు స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ



పతకాలు సాధించిన ఆలేరు పోలీసులు

నెల్లికుదురు: తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా పోలీసులు ప్రతిభ కనబర్చారు. నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామానికి చెందిన ముగ్గురు పోలీసులు కోరే రాజు, వేల్పుల శిరీషా, మహేష్ హైదరాబాద్‌లో పోలీస్‌శాఖలో పనిచేస్తున్నారు. జనవరి 28 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో వాటర్ స్పోర్ట్స్‌లో కోరే రాజు గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించగా ఇదే గేమ్‌లో వేల్పుల మహేష్ బ్రోన్జ్ మెడల్, శిరీషా యోగాలో సిల్వర్ మెడల్ సాధించారు.

ఎస్సార్‌లో వర్క్‌షాప్


మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీనివాస్

హసన్‌పర్తి : హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని ఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. 'ఉన్నత విద్యలో జనరేటివ్ ఏఐ,ఇంటరాక్టివ్ ఇ–కంటెంట్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈసమావేశానికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్, ప్రాజెక్ట్ మేనేజర్,న్యూఢిల్లీ ప్రొఫెసర్ కె. శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్నత విద్యలో కీలక సమగ్రతపై దృష్టి సారించిందన్నారు. ఎస్సార్ యూనివర్సిటీ వీసీ దీపక్ గార్గ్ మాట్లాడుతూ ఎస్సార్ యూనివర్సిటీ విద్యను ఆధునిక దృక్పథంతో నేర్పిస్తోందన్నారు. గంట పాటు నిర్వహించే తరగతిలో అధ్యాపకులు 10 నిమిషాలు భావాలు వివరించాలని, మిగతా 50 నిమిషాలు పరికల్పిత అభ్యాసం, ప్రాక్టీస్ ఆధారిత కార్యకలాపాలకు కేటాయించాలన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుమన్, అసోసియేట్ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో ఒకరి అరెస్ట్



నెల్లికుదురు: ఓ మహిళపై లైంగికదాడికి పాల్పడిన కేసులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తొర్రూరు సీఐ గణేశ్, ఎస్సై చిర్ర రమేశ్ బాబు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు విలేకరులకు వివరాలు వెల్లడించారు. గద్వాల జిల్లాకు చెందిన ఓ కుటుంబం బతుకుదెరువు నిమిత్తం తొర్రూరుకు వలస వచ్చారు. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం హనుమాన్‌నగర్‌తండా శివారు భూక్య ధాన్యతండాకు చెందిన భూక్య దేశిలాల్ వారితో పరిచయం పెంచుకుని గొర్రెల కాపరిగా జీతం కుదుర్చుకుని భూక్య ధాన్యతండాకు నాలుగు నెలల క్రితం తీసుకొచ్చాడు. అప్పటి నుంచి ఆ మహిళపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 29న లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితురాలు ఈ నెల 29న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టి దేశిలాల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్సై వివరించారు

పోక్సో కేసులో ఒకరు..

పోక్సో కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై చిర్ర రమేశ్ బాబు శనివారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం కాంస్య తండాకు చెందిన బానోత్ అజయ్ గత నెల 29న మండలంలోని ఓ తండాకు చెందిన బాలికపై లైంగికదాడికి యత్నించాడు. ఈ ఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అజయ్‌ని అరెస్ట్ చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

ప్రభుత్వ భూముల్లో సౌర పంట..

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం



- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ స్థలాలు గుర్తిస్తున్న అధికారులు
- ఇందులో ప్లాంట్ల ఏర్పాటునకు 54 స్థలాలు అనుకూలం
- ప్లాంట్ ఏర్పాటుతో 56.5 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి
- నాలుగేళ్లలో మహిళలను కోటీశ్వరులను చేస్తామంటున్న సర్కారు

హన్మకొండ : సౌర విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా 'ప్రధాన మంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఎవం ఉత్థాన్ మహాభియాన్' (పీఎం కుసుం) పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకాన్ని ఆయా రాష్ట్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఈ పథక అమలులో భాగంగా రైతులతో పాటు మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తి సంఘాలు, సహకార సంఘాలు, పంచాయతీలు, నీటి వినియోగదారుల సంఘాలు.. ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేలా పథకాన్ని రూపొందించింది. ప్రభుత్వ, దేవాలయ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. వీరు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను స్థానిక డిస్కంలు ముందు నిర్ణయించిన టారిఫ్ ధరలకు కొనుగోలు చేస్తాయి.

యుద్ధప్రాతిపదికన ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ..

రాష్ట్రంలో ప్రభుత్వ, దేవాలయ భూముల్లో మహిళా స్వయం సహాయక సంఘాలతో సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యం విధించుకుంది. ఇందులో వెయ్యి మెగావాట్లు మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఉత్పత్తి చేయనుంది. ఈ మేరకు ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ యుద్ధప్రాతిపదికన చేపట్టింది. ఇప్పటికే ప్రభుత్వ భూముల గుర్తింపుతో పాటు సోలార్ ప్లాంట్ల ఏర్పాటునకు అనువుగా ఆయా స్థలాలు ఉన్నాయా లేదో అధికారులు పరిశీలన చేస్తున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 97 స్థలాల్లో 1,027 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. టీజీ రెడ్‌కో, తహసీల్దార్, డీఆర్‌డీఓ, ఎన్పీడీసీఎల్ అధికారుల బృందం ఇప్పటి వరకు 97 స్థలాల్లో 967 ఎకరాలను క్షేత్ర పరిశీలన చేశారు. ఇందులో ఒక స్థలంలో ఎస్సారెస్పీకి చెందిన 60 ఎకరాల స్థలం ఉంది. ఈ స్థలంపై సంబంధిత శాఖ అధికారులతో సానుకూలత రావాల్సి ఉంది. మొత్తం 97 స్థలాల్లో 54 స్థలాల్లో 226 ఎకరాలు సోలార్ ప్లాంట్ల ఏర్పాటునకు అనువుగా ఉన్నట్లు, 42 స్థలాలు అనువుగా లేనట్లు గుర్తించారు. అనువుగా ఉన్న స్థలాల్లో ప్లాంట్ల ఏర్పాటు చేయడం ద్వారా 56.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చని టీజీ రెడ్‌కో ఉమ్మడి వరంగల్ జిల్లా మేనేజర్ మహేందర్ రెడ్డి తెలిపారు. ఒక మెగావాట్ సౌర విద్యుత్ ఉత్పత్తికి 4 ఎకరాల స్థలం అవసరం.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం..

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ భూముల్లో మహిళా స్వయం సహాయక సంఘాలతో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సోలార్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా 25 సంవత్సరాలు ఆదాయం పొందొచ్చు. దీని ద్వారా నాలుగు సంవత్సరాల్లోనే స్వయం సహాయక సంఘాల సభ్యులు కోటీశ్వర్లు అవుతారని ప్రభుత్వం భావిస్తోంది. మెగావాట్ సోలార్ ఉత్పత్తి ద్వారా సంవత్సరానికి రూ.26 లక్షలు, నెలకు రూ.2.17 లక్షలు ఆదాయం వస్తుంది. డిస్కంలు అదనంగా ఇన్సెంటివ్‌గా ఐదేళ్ల కాలానికి మెగావాట్‌కు ప్రోత్సాహకంగా రూ.6.6 లక్షలు అందిస్తుంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వ భూములను నామమాత్రపు అద్దె ఏడాదికి రూ.25వేలకు తీసుకుని ప్లాంట్ ఏర్పాటు చేస్తారు. ఎంపికైన స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా 15 సంవత్సరాల కాలానికి రుణాలు ఇప్పిస్తారు. టీజీ రెడ్‌కో, డిస్కంల సాంకేతిక సాయంతో సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలి. 25 సంవత్సరాల పాటు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. ఒక్క మెగావాట్ ప్లాంట్‌కు రూ.3 కోట్ల వ్యయం కానుంది. ఇందులో స్వయం సహాయక సంఘాలు 10 శాతం కింద రూ.30 లక్షలు భరిస్తే, బ్యాంకు 90 శాతం రుణం కింద రూ.2.70 కోట్లు అందిస్తుంది. ప్లాంట్ ద్వారా ఏడాదికి 1.66 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. రోజుకు దాదాపు 4,500 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. యూనిట్‌కు డిస్కంలు రూ.3.13 చొప్పున చెల్లిస్తాయి. నెలకు ఉత్పత్తి అయిన విద్యుత్‌ను బట్టి ప్రతి నెల డిస్కం చెల్లింపులు చేస్తుంది.

జిల్లాల వారీగా ప్రభుత్వ స్థలాల వివరాలు...

జిల్లా	ప్రభుత్వ భూమి (ఎకరాల్లో)	పరిశీలించిన భూమి (ఎకరాల్లో)	మొత్తం స్థలాలు (అంకెలు)	అనుకూల స్థలాలు (అంకెలు)	ఉత్పత్తికి అవకాశం (మెగావాట్లు)
హనుమకొండ	313.4	314.4	38	15	13.25
వరంగల్	198.3	138.3	14	06	6.75
ములుగు	66	66	12	11	12.75
మహబూబాబాద్	27.30	27.30	05	05	3.75
జె.ఎస్.భూపాలపల్లి	51.2	51.2	13	08	8
జనగామ	370.27	370.27	15	09	12

సమస్యల సత్వర పరిష్కారం

- రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో కోర్టు ప్రారంభం


కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ నంద

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలో కోర్టు ఏర్పాటుతో పెండింగ్ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద అన్నారు. ఈ మేరకు శనివారం ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి, ప్రథమ శ్రేణి న్యాయస్థాన భవనాన్ని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి, సెషన్స్ జడ్జి రవీంద్రశర్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జి జస్టిస్ నంద మాట్లాడుతూ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న స్థానిక ప్రజల కల నెరవేరిందని, ఇది ప్రజల హక్కుగా భావించాలన్నారు. ఇకపై కేసులు జాప్యం లేకుండా పరిష్కారమవుతాయని, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మధ్యవర్తిత్వం లేకుండా కేసులను సత్వరమే పరిష్కరించుకోవచ్చనన్నారు. కక్షిదారులకు సొమ్ముతో పాటు సమయం వృథా కావొద్దనే ఉద్దేశంతో స్టేషన్‌ఘన్‌పూర్‌లో కోర్టు ఏర్పాటు చేశామన్నారు. దాదాపు 3వేల కేసులు ఘన్‌పూర్ న్యాయస్థానం పరిష్కరించనుందని వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, జిల్లా ప్రిన్సిపల్ జడ్జి రవీంద్రశర్మ, అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, డీసీపీ రాజమహేంద్రనాయక్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జిలు విక్రమ్, సుచరిత, జి.శశి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సందీప, ఏసీపీ భీమ్‌శర్మ, జనగామ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.చంద్రరుషి, స్టేషన్‌ఘన్‌పూర్ అసోసియేషన్ అడహక్‌కమిటీ కన్వీనర్ కనకం గణేశ్, జనార్దన్, రవీందర్, ఫణీంద్రభార్గవ్, గట్టు మనోహర్ పాల్గొన్నారు.

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు..

తెలంగాణకు మొండిచేయి



సాక్షి, మహబూబాబాద్: కేంద్ర బడ్జెట్ పూర్తిగా ఎన్నికల బడ్జెట్‌గా ఉంది. రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు చేయలేదు. బీహార్ ఎన్నికల దృష్ట్యా కేటాయింపులు చేశారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీని మరచిపోయారు. మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వలేదు. కొత్త రైల్వే ప్రాజెక్టులు ఇవ్వలేదు. బీజేపీ మిత్రపక్షాలు ఉన్న రాష్ట్రాల్లో బడ్జెట్ కేటాయింపులకు పెద్ద పీట వేశారు.

– మాలోత్ కవిత, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు

ఎన్నికల బడ్జెట్..



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్యులకు ఎలాంటి ప్రయోజనాలు కనిపించడం లేదు. విద్యకు పెద్దగా ప్రాధాన్యం కల్పించలేదు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఊసే లేదు. బీహార్ రాష్ట్రానికి అనుకూలంగా రూపొందించారు. జిల్లాకు, రాష్ట్రానికి ఎలాంటి కేటాయింపులు లేవు. పూర్తిగా ఎన్నికల బడ్జెట్‌గా కనిపిస్తుంది.

– వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ

జనరంజక బడ్జెట్



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు, రైతులు, విద్యార్థులు, బాలింతలకు లబ్ధి చేకూర్చేలా ఉంది. రూ.12 లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు, రూ.5 లక్షల వరకు కిసాన్ క్రెడిట్ కార్డులు, కేన్సర్ రోగుల మందుల ధర తగ్గింపు వంటి కేటాయింపులు పేదలకు మేలు చేస్తాయి.

– యలమంచలి వెంకటేశ్వర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా ఉంది



కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు చూస్తే ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు పట్టం కట్టేలా ఉన్నాయి. బీహార్ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రానికి ఎక్కువ నిధులు కేటాయించారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ విషయం మళ్లీ మరుగున పడేశారు.

– విజయ్‌సారథి రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి

విద్యను విస్మరించారు



బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులు రూ.1,28,650 కోట్లు మాత్రమే. కేంద్రం ఏటా విద్యకు కేటాయింపులు తగ్గిస్తోంది. గత పదేళ్లలో 3.16 నుంచి 2.53 శాతానికి నిధులు తగ్గిస్తూ విద్యలో ప్రైవేట్ సంస్థల ప్రాధాన్యం పెంచేలా చేయడంతో బలహీన వర్గాలకు మెరుగైన విద్య అందడంలేదు. బడ్జెట్‌లో కనీసం 6 శాతం కేటాయిస్తేనే విద్యాసంస్థలకు మౌలిక వసతులు కల్పించే అవకాశం ఉంటుంది.

– మైస శ్రీనివాస్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

సమతుల్య సామాన్య వర్గాల బడ్జెట్



వరంగల్: బడ్జెట్‌లో ప్రభుత్వం పప్పు ధాన్యాల ఉత్పత్తి, నీటిపారుదల, రైతు సంక్షేమంపై దృష్టి సారించింది. వ్యవసాయానికి గణనీయమైన నిధులు కేటాయించి రైతన్నకు ఊతమిస్తోంది. జాతీయ ఆరోగ్య మిషన్ విస్తరణకు ప్రభుత్వం నిధులను కేటాయించడంతో సామాన్యులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందే అవకాశం ఉంది. ఈపీఎఫ్‌నకు ఇచ్చే విరాళాలను పన్ను నుంచి మినహాయించడంతో ఉద్యోగ విరమణ పొందేవారి పొదుపును ప్రోత్సహించినట్లయ్యింది. ఆదాయ పన్ను పరిమితి పెంపు పేద, మధ్యతరగతి జీవులకు పెద్ద ఉపశమనం.

– పీవీ.నారాయణరావు, సీఏ, ఏపీ, తెలంగాణ టాక్స్ బార్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు

నిరాశ పర్చిన బడ్జెట్



హన్మకొండ: పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆద్యంతం నిరాశపర్చింది. ఆదాయ పన్నులో ఉద్యోగులు పొదుపు చేసే పాత విధానంలోని 80 సీ పెంచే ప్రస్తావన కానీ, గృహ నిర్మాణ రుణం, విద్యా రుణం, మెడికల్ ఇన్సూరెన్స్ ప్రస్తావన లేదు. స్టాండర్డ్ డిడెక్షన్ గతంలో ఉన్నట్లు రూ.75 వేలే ఉంది. పెంచలేదు. విద్యా, వైద్యరంగానికి తగిన కేటాయింపుల్లేవు. భీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డీఐలతో దేశీయ బీమా కంపెనీలు కుదేలైపోతాయి.

– తూపురాణి సీతారాం, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ

పొదుపునకు మినహాయింపు ఇస్తే బాగుండేది...



కేయూ క్యాంపస్: ఆదాయపు పన్ను విషయంలో పాత విధానంలో కూడా కొన్ని మార్పులు చేస్తే బాగుండేది. కొత్త విధానానికి పొదుపునకు సంబంధించిన సెక్షన్ 80 సి, కి సంబంధించిన రూ 1,50,000 గృహ రుణాల అసలు, వడ్డీ మిగతా పొదుపు పథకాలకు కూడా మినహాయింపు ఇస్తే బాగుండేది. వాటికి కూడా మినహాయింపు ఇస్తే రూ 12లక్షల పైబడిన ఆదాయం ఉన్నవారికి కూడామేలు జరుగుతుంది, మొత్తంగా ఈసారి బడ్జెట్‌ల చిరు, మధ్యతరగతి ఉద్యోగులకు కొంత మేలు జరగబోతోంది.

– పెండెం రాజు, టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా జనరల్ సెక్రటరీ

రాష్ట్రానికి మొండి చెయ్యి



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చెయ్యి మిగిలింది. ప్రత్యేక కేటాయింపులు లేవు. రాష్ట్రానికి చెందిన ఎనిమిది మంది ఎంపీలు కేటాయింపుల్లో ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యారు. అంకెలతో ఆదాయపు పన్ను మినహాయింపు మధ్య తరగతికి పెద్ద ఊరట అని బీజేపీ చేస్తున్న ప్రచారం అవాస్తవం. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి కేటాయింపులు లేవు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసేలేదు.

– టి.శ్రీనివాస్‌రావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి

సరైన ప్రణాళికతోనే పరిశోధన ముందుకు..

- కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్ : సరైన సిద్ధాంత గ్రంథ ప్రణాళికతోనే పరిశోధన ముందుకెళ్తుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అన్నారు. కేయూలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో నిర్వహిస్తున్న పీహెచ్‌డీ కోర్సుల వర్క్ ముగింపు సమావేశంలో శనివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సిద్ధాంత గ్రంథ సమర్పణ మధ్యకాలాన్ని సరిగా విభజించుకోవాలన్నారు. పరిశోధకులు సెమినార్లు, కార్యశాలలకు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో విద్య కళాశాల డీన్ ప్రొఫెసర్ రాంనాథ్ కిషన్, బీఓఎస్ చైర్మన్, నిట్ వ్యాయామ విభాగం ఆచార్యుడు రవికుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏటీబీ ప్రసాద్, ఆచార్య రమేశ్‌రెడ్డి, స్టాటిస్టిక్స్ విభాగం అధిపతి జె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దగట్టుకు దేవరపెట్టె తరలింపు


దంతాలపల్లిలో పెట్టె తరలింపులో పాల్గొన్న యాదవులు

దంతాలపల్లి : యాదవుల ఆరాధ్య దైవమైన సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి పెద్దగట్టు లింగన్న జాతరకు దేవరపెట్టె (ఇందులో 33 విగ్రహాలు ఉంటాయి)ను శనివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చీకటాయపాలెం నుంచి సంప్రదాయబద్ధంగా తరలించారు. అరిపిరాల, చీకటాయపాలెం గ్రామాల్లో నిర్వహించిన దేవరపెట్టె మహాయాత్రలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పాల్గొని పూజలు చేశారు. దేవరపెట్టెను దంతాలపల్లి మీదుగా రాత్రి 12 గంటల వరకు కేశవపురం గ్రామానికి చేర్చారు. ఆదివారం పెద్దగట్టుకు చేరుకుంటుంది. చీకటాయపాలెం గ్రామంలోని తండా వంశస్తులు జాతర ముగియగానే పెట్టెను తెచ్చి తమ ఇంటిలో భద్రపరుస్తారని యాదవ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు తండ వెంకన్న, యాదవ సంఘం సభ్యులు కళింగా, ఐలేశ్, మురళి, సురేశ్, హరీశ్, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఓఎస్‌డీగా మల్లారెడ్డి


పి. మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఆఫీసర్ ఆన్ స్పెషల్‌డ్యూటీ (ఓఎస్‌డీ)గా మ్యాథ్స్‌విభాగం ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి నియమితులయ్యారు. వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అప్రూవల్ మేరకు రిజిస్ట్రార్ రాంచంద్రం ఉత్తర్వులు జారీచేశారు. మల్లారెడ్డి సంవత్సరం పాటు ఓఎస్‌డీ పదవిలో కొనసాగుతారు. కేయూలో తొలిసారి ఓఎస్‌డీ పదవిలో ప్రొఫెసర్‌ను నియమించాలని కొద్దిరోజుల క్రితం నిర్వహించిన కేయూ పాలకమండలి సమావేశంలో నిర్ణయించిన విషయం విధితమే. మల్లారెడ్డి 2007లో మాథ్‌మెటిక్స్‌విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియామకమయ్యారు. అనంతరం ప్రొఫెసర్, సైన్స్ విభాగం డీన్, కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి, పరీక్షల నియంత్రణాధికారి, రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. రేపు ఓఎస్‌డీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

నేడు బీసీ రాజకీయ యుద్ధభేరి

- ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహణ
- తరలిరానున్న వివిధ రాష్ట్రాలకు చెందిన రాజకీయ ప్రముఖులు


సభాప్రాంగణంలో ఏర్పాటు చేసిన కుర్చీలు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీ గ్రౌండ్‌లో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బీసీ రాజకీయ యుద్ధభేరి బహిరంగ సభ జరగనుంది. ఆధిపత్యకులాలు బీసీలను కేవలం ఓటర్లుగానే వినియోగించుకుంటున్నాయని, అందుకే బీసీలు చైతన్యవంతులై రాజ్యాధికారం దిశగా సాగాలంటే ఐక్యంగా ముందుకు సాగి తమ సత్తా చూపించాలనే నినాదంతో హలో బీసీ.. చలో వరంగల్ పేర బీసీ రాజకీయ యుద్ధభేరి సభ నిర్వహిస్తున్నారు. కాగా, వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్ల న్న, 'కుడా' మాజీ చైర్మన్, బీసీ నేత సుందర్‌రాజుయాదవ్ కొద్దిరోజులుగా బీసీ రాజకీయ యుద్ధభేరి సభ విజయవంతానికి వివిధ జిల్లాలో విస్తృత ప్ర చారం చేశారు. ఇందులో భాగంగా తీన్మార్ మల్లన్న కేయూలో బీసీ విద్యార్థులు, బీసీ ఉద్యోగులతో ఇటీవల సమావేశం ఏర్పాటు చేసి బీసీలు ఎలా అన్యాయానికి గురవుతున్నారో వివరించి వారి మద్దతు కూడగట్టారు. అలాగే, సింగరేణి కార్మికులు, ఆర్టీసీ కార్మికులను కూడా కలిసి సభకు తరలిరావాలని కోరారు. ఈ క్రమంలో శనివారం సుందర్‌రాజు యాదవ్ ఆధ్వర్యంలో కాజీపేట నుంచి వరంగల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బీసీల ఇంటలెక్చువల్ ఫోరం కూడా సభకు బీసీలు అధిక సంఖ్యలో తరలిరావాలని ప్రచారం చేస్తోంది.

సభకు హాజరుకానున్న రాజకీయ ప్రముఖులు

బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు బీసీ కులస్తులను అధిక సంఖ్యంలో తరలించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరుజిల్లాల నుంచి వాహనాలను అందుబాటులో ఉంచామని నిర్వాహకులు చెబుతున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలనుంచి కూడా బీసీ సంఘాల బాధ్యులు తరలిరానున్నారని సమాచారం. ఈ సభకు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండాప్రకాశ్, తమిళనాడులోని డీఎంకే ఎంపీ విల్సన్, బిహార్‌లోని ఆర్‌జేడీ పార్టీ ఎంపీ మిసా భారతియాదవ్, సమాజ్‌వాది పార్టీకి చెందిన ఉత్తర్ ప్రదేశ్ ఎంపీ ధర్మేందర్ హాజరవుతారని నిర్వాహకుడు సుందర్‌రాజుయాదవ్ తెలిపారు.

ఫైనాన్స్ చెల్లించడం లేదని మహిళలపై దౌర్జన్యం

- నిర్వాహకుడిపై పోలీసులకు ఫిర్యాదు

ఖిలా వరంగల్ : లారీ ఈఎంఐ చెల్లించలేదని ఇంట్లోకి ప్రవేశించి మహిళలపై దౌర్జన్యానికి పాల్పడిన ఓ ప్రైవేట్ ఫైనాన్స్ నిర్వాహకుడిపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు అజ్మత్ తెలిపారు. బాధితుడి కథనం ప్రకారం.. శివనగర్‌కు చెందిన అజ్మత్.. లారీ కొనుగోలు నిమిత్తం ఓ ఫైనాన్స్ నిర్వాహకుడి వద్ద రూ. 5.70 లక్షలు తీసుకున్నాడు. డిసెంబర్‌లో తన కుమార్తె అనారోగ్యానికి గురికావడంతో రెండు నెలల ఈఎంఐ చెల్లించలేదు. దీంతో శనివారం ఉదయం అజ్మత్ లేని సమయంలో సదరు ఫైనాన్స్ నిర్వాహకుడు ఇంట్లోకి ప్రవేశించి మహిళలను దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురిచేశాడు. మరో నెల రోజుల సమయం ఇవ్వాలని కోరినా వినకుండా దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై సదరు ఫైనాన్స్ నిర్వాహకుడిపై మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు అజ్మత్ తెలిపారు.



సచిన్‌కు బీసీసీఐ 'జీవిత సాఫల్య' పురస్కారం

మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 'జీవిత సాఫల్య' పురస్కారం అందజేసింది. ముంబైలో శనివారం జరిగిన బీసీసీఐ వార్షిక అవార్డుల కార్యక్రమంలో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అధ్యక్షుడు జై షా చేతుల మీదుగా సచిన్ ఈ పురస్కారాన్ని అందుకున్నాడు. క్రికెట్లో దేశానికి అందించిన విశేష సేవలకు గుర్తింపుగా భారత తొలి కెప్టెన్ కల్నల్ సీకే నాయుడు పేరు మీదుగా 1994 నుంచి ఈ 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును ప్రదానం చేస్తున్నారు.

పసిడి పతకం నెగ్గిన పల్లవి



డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. శనివారం జరిగిన మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 71 కేజీల విభాగంలో సనాపతి పల్లవి పసిడి పతకం సొంతం చేసుకుంది. పల్లవి మొత్తం 212 కేజీల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది. పల్లవి స్నాచ్‌లో 94 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 118 కేజీలు బరువెత్తింది. శుక్రవారం పురుషుల 67 కేజీల విభాగంలో నీలంరాజు ఆంధ్రప్రదేశ్‌కు తొలి బంగారు పతకాన్ని అందించాడు.



కేలా రెనెకి
నికీ ప్రసాద్

ఒకటే లక్ష్యం... రెండో ప్రపంచకప్

కౌలాలంపూర్: రెండేళ్ల క్రితం దక్షిణాఫ్రికా గడ్డపై జరిగిన మొట్టమొదటి అండర్-19 టి20 ప్రపంచ కప్‌లో భారత అమ్మాయిల జట్టు జగజ్జేతగా అవతరించింది. రెండేళ్ల తర్వాత అదే ప్రపంచకప్‌ను నిలబెట్టుకునేందుకు ఈసారి దక్షిణాఫ్రికా జట్టుతో టీమిండియా ఫైనల్ సంగ్రామానికి సిద్ధమైంది. అజేయంగా తుది పోరుకు అర్హత సాధించిన నికీ ప్రసాద్ నాయకత్వంలోని భారత అమ్మాయిల జట్టు విజయవంతంగా 'రెండో ప్రపంచకప్ మిషన్' పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉంది. భారత్ మాదిరిగానే ఓటమి లేకుండా ఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా జట్టు వరల్డ్‌కప్ ముచ్చట తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో జోరు మీదున్న రెండు అజేయ జట్ల మధ్య నేడు జరిగే అండర్-19 ప్రపంచకప్ టైటిల్ పోరుపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈసారీ భారత్ జైత్రయాత్ర కొనసాగుతుందా! లేదంటే కొత్త చాంపియన్ ఆవిర్భవిస్తుందా! మరి కొన్ని గంటల్లో తేలిపోతుంది. అటు బ్యాటింగ్, ఇటు

నేడు మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్ టైటిల్ పోరు
- దక్షిణాఫ్రికాతో భారత్ 'ఢీ'
- ఓటమి లేకుండానే రెండు జట్లు ఫైనల్లోకి
- త్రిష, కమలినిలపై దృష్టి
- మధ్యాహ్నం 12 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

బౌలింగ్ వనరులతో పూర్తిస్థాయి ఆల్‌రౌండ్ సామర్థ్యంతో ఉన్న టీనేజ్ టీమిండియాను ఎదుర్కోవడమే ఎవరికైనా అతిపెద్ద సవాల్. ఇక అలాంటి అభేద్యమైన జట్టును ఓడించాలంటే మాత్రం దక్షిణాఫ్రికా మైదానంలో పెద్ద 'ప్రపంచ' యుద్ధమే చేయాలనడంలో అతిశయోక్తి లేదు!

ఆ ఇద్దరిని కట్టడి చేస్తే...

తెలంగాణ స్టార్ బ్యాటర్ గొంగడి త్రిష! మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో తనను విస్మరించిన ఫ్రాంచైజీల కళ్లకు కట్టుకున్న గంతల్ని తన అసాధారణ బ్యాటింగ్‌తో విప్పేసింది. ఇప్పుడు 'ఫైనల్ మిషన్' ముంగిట అందరి దృష్టి ఆమెపైనే ఉంది. ఈ టోర్నీలో ఓపెనర్ త్రిష ఫామ్, క్రీజులో ఆమె కనబరుస్తున్న పోరాటపటిమ ప్రత్యర్థి బౌలర్లకు కఠిన సవాళ్లు విసురుతున్నాయి. మరో ఓపెనర్ కమలిని, సనిక చాల్కెలతో కూడిన భారత బ్యాటింగ్ విభాగం పటిష్టంగా ఉంది. దక్షిణాఫ్రికా విజయంపై ఆశలు పెంచుకోవాలంటే మాత్రం ముఖ్యంగా త్రిష, కమలినిలను తక్కువ స్కోరుకు పరిమితం చేయాల్సి ఉంటుంది. ఈ టోర్నీలో త్రిష 265 పరుగులతో టాప్ స్కోరర్‌గా ఉండగా... కమలిని 135 పరుగులతో మూడో స్థానంలో ఉంది. ఆ తర్వాత భారత్ నుంచి అత్యధిక పరుగులు సనిక చాల్కె (6 మ్యాచ్‌ల్లో 69) చేసింది. భారత బౌలింగ్ విభాగాని కొస్తే ఆయుశి శుక్లా, పారుణిక సిసోడియా, వైష్ణవి శర్మలతో కూడిన స్పిన్ త్రయం విశేషంగా రాణిస్తోంది. సహజంగానే సఫారీలకు స్పిన్ అంటేనే కష్టం. అలాంటి జట్టుపై ఫామ్‌లో ఉన్న ఈ ముగ్గురు స్పిన్నర్లు తప్పకుండా ప్రభావం చూపిస్తారు. అలాగని ఫైనల్‌కు చేరిన సఫారీ జట్టును తక్కువ అంచనా వేయలేం. కేలా రెనెకి కెప్టెన్సీలో దక్షిణాఫ్రికా జట్టు సెమీఫైనల్లో గట్టి ప్రత్యర్థి ఆస్ట్రేలియాను బౌలింగ్‌తో కట్టడి చేసి... బ్యాటింగ్‌తో చుట్టేసింది. జెమ్మా బోతా, లౌరెన్స్, కరబొ మెసోలతో కూడిన బ్యాటింగ్ లైనప్, ఆష్లే వాన్‌విక్, ఎన్‌తబిసెంగ్ నిని, శేషిని నాయుడులతో కూడిన బౌలింగ్ దళం కూడా మెరుగ్గా ఉంది.

పిచ్, వాతావరణం

భారత్‌కు బాగా అలవాటైన పిచ్. అటు బౌలింగ్‌కు, ఇటు బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశం ఉంది. సాధారణ వాతావరణమే. వాన ముప్పు దాదాపుగా లేదు.

ఆధిక్యం కోసం ఆఖరి పోరు



ముంబై: ఇప్పటికే సిరీస్ భారత్ చేతికందింది. ఇక మిగిలిందల్లా ఆధిక్యం పెంచుకోవడమే! మూడు వన్డేల సిరీస్‌కు ముందు ఈ చివరి మ్యాచ్ గెలిచి... 4-1తో ఆధిక్యం, ఆత్మవిశ్వాసంతో వెళ్లాలని టీమిండియా భావిస్తోంది. ఇక ఇంగ్లండ్ పరిస్థితి దీనికి భిన్నం. చేజారిన సిరీస్‌తో ఒత్తిడిలో ఉన్న బట్లర్ బృందం ఇప్పుడు భారత్ ఆధిపత్యానికి గండి కొట్టాలని... ఈ పొట్టి సిరీస్‌లో ఆతిథ్య జట్టు శుభారంభమివ్వగా... విజయంతో ముగింపు తమది కావాలని ఇంగ్లండ్ జట్టు గట్టిగా ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో ఆఖరి పోరులో పైచేయి సాధించేందుకు పర్యాటక జట్టు సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమైంది. మొత్తంమీద ఇరుజట్ల మధ్య మరో రసవత్తర పోరుకు నేడు వాంఖెడే స్టేడియం వేదిక కానుంది.

సంజూ... మెరిపించు!

ఈ సిరీస్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ ఆడాడు. తిలక్ వర్మ గెలిపించే 'షో' చేశాడు. హార్దిక్ పాండ్యా అసలైన ఆటను గత మ్యాచ్‌లో బయటికి తెచ్చాడు. అక్షర్ పటేల్ బంతితో లేదంటే బ్యాటింగ్‌తో జట్టుకు అక్కరకొస్తున్నాడు. అంతెందుకు అరకొరగా... అంటే శివమ్ దూబే 'కన్‌కషన్'తో తుది జట్టులోకి వచ్చిన హర్షిత్ రాణా కూడా మ్యాచ్ గెలిపించే బౌలింగ్ ప్రదర్శన కనబరిచాడు. కానీ టాప్-4లో ఓపెనర్ సంజూ సామ్సన్, కెప్టెన్ సూర్యకుమార్‌ల తోనే జట్టు మేనేజ్‌మెంట్ కలవరపడుతోంది. తర్వాతి ప్రపంచకప్ వేటకు కోచ్ గంభీర్ కోర్ గ్రూపులోని ఆటగాళ్లు ఇలా వరుసగా విఫలమవడం జట్టుకు ప్రతికూలంగా మారింది. బౌలింగ్‌లో అర్ష్‌దీప్, పాండ్యాలు వెన్నుదన్నుగా నిలుస్తుంటే స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఉన్నపళంగా మ్యాచ్‌ను మలుపుతిప్పే మాయాజాలంతో ఆకట్టుకుంటున్నాడు. రవి బిష్ణోయ్ కూడా ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నాడు.

నేడు ఇంగ్లండ్‌తో భారత్ ఐదో టి20 మ్యాచ్
- సంజూ సామ్సన్, సూర్యకుమార్‌లకు మరో అవకాశం
- ఒత్తిడిలో బట్లర్ బృందం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

2-3 లక్ష్యంతో ఇంగ్లండ్

సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లండ్‌కు ఇప్పుడు ఆఖరి పంచ్ మాత్రమే మిగిలుంది. ఇందులో తమ పవర్ చాటుకొని తదుపరి వన్డే సిరీస్‌ను తాజాగా ప్రారంభించాలని బట్లర్ జట్టు అనుకుంటుంది. సాల్ట్ గత మ్యాచ్‌లో టచ్‌లోకి వచ్చినా కొద్దిసేపే క్రీజులో ఉన్నాడు. ఇప్పుడు లయను అందుకుంటే బెన్ డకెట్‌తో ఓపెనింగ్ వికెట్‌కు భారీ ఆరంభం ఇవ్వగలడు. ఇదే జరిగితే... తదుపరి పరుగుల ప్రవాహాన్ని బట్లర్, హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్, జాకబ్ బెథెల్, బ్రైడన్ కార్స్‌లు తీసుకెళ్తారు. ఆర్చర్, సకిబ్ మహమూద్ పేస్‌తో ఆకట్టుకుంటుండగా, స్పిన్‌తో ఆదిల్ రషీద్ నిలకడను ప్రదర్శిస్తున్నాడు.

5 వాంఖెడే మైదానంలో ఇప్పటి వరకు భారత జట్టు ఐదు టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో మూడింటిలో గెలిచి, రెండింటిలో ఓడిపోయింది. చివరి మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టే నెగ్గింది.

సిరీస్ చేజారినా... సమరంలో పట్టు కోల్పోరాదని ఐదో టి20లో నిరూపించుకోవాలని ఇంగ్లండ్ బృందం చూస్తోంది.

పిచ్, వాతావరణం

వాంఖెడే బ్యాటింగ్‌కు అచ్చొచ్చే పిచ్. చాలా మ్యాచ్‌ల్లో, ప్రత్యేకించి టి20ల్లో చేజింగ్ జట్లకు విజయ అవకాశాలిచ్చింది. అలాగని బౌలింగ్ తేలిపోదు. స్పిన్నర్లు ప్రభావం చూపొచ్చు. వాన ముప్పు లేదు.

బడ్జెట్‌లో క్రీడలకు రూ.3,794 కోట్లు

గతం కంటే 351.98 కోట్లు పెంపు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో క్రీడలు, యువజన సర్వీసుల శాఖకు రూ. 3,794.30 కోట్లు కేటాయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆ మేరకు నిధుల్ని కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ. 3442.32 కోట్లు ఇవ్వగా... తాజాగా రూ.351.98 కోట్లు పెంచింది. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమానికే ఈ క్రీడా బడ్జెట్లో ప్రాధాన్యం దక్కింది. గతంలో రూ. 800 కోట్లు కేటాయించగా ఈసారి ఆ మొత్తాన్ని రూ. 1000 కోట్లకు పెంచింది. నికరంగా రూ. 200 కోట్లను హెచ్చింపు చేసింది. జాతీయ క్రీడా సమాఖ్యలకు ఇచ్చే గ్రాంట్లను కూడా పెంచింది. గతంలో సమాఖ్యలకు రూ. 340 కోట్లు ఇవ్వగా తాజా ఆర్థిక సంవత్సరంలో రూ. 400 కోట్లు కేటాయించారు. భారత స్పోర్ట్స్ అథారిటీకి రూ. 830 కోట్లు (గత బడ్జెట్ కంటే రూ. 15 కోట్లు అదనం) ఇవ్వనున్నారు. అథ్లెట్ల పారదర్శకత పోటీ కోసం పాటుపడుతున్న జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) లాబోరేటరీకి రూ. 23 కోట్లు (గతంలో రూ. 18.70 కోట్లు) కేటాయించింది. 1998లో ఏర్పాటు చేసిన జాతీయ స్పోర్ట్స్ అభివృద్ధి నిధి కోసం రూ. 18 కోట్లను యథాతథంగా కొనసాగించినప్పటికీ... క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు స్వల్పంగా కోత పెట్టింది. పోయిన ఏడాది రూ. 42.65 కోట్లు ఇస్తే ఈసారి రూ. 37 కోట్లకు పరిమితం చేసింది. యువజన సర్వీసులకు భారీగా కోత పెట్టింది. గత బడ్జెట్లో రూ. 55 కోట్లు కేటాయిస్తే ఈసారి కేవలం రూ. 11.70 కోట్లే విదిలించింది. జమ్మూకశ్మీర్‌లో క్రీడా సదుపాయల కల్పన కోసం రూ. 20 కోట్లు ఇవ్వనుంది. గతం కంటే రూ. 14 కోట్లు ఎక్కువగా కశ్మీర్‌లో మౌలిక సౌకర్యాలకు వెచ్చించనుంది.

టోగోపై 2-0 ఆధిక్యంలో భారత్

న్యూఢిల్లీ: డేవిస్‌కప్ ప్రపంచ టీమ్ టెన్నిస్ వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్ మ్యాచ్‌లో భారత్ శుభారంభం చేసింది. టోగో జట్టుతో శనివారం మొదలైన ఈ పోటీలో తొలి రోజు జరిగిన రెండు సింగిల్స్‌లోనూ భారత ఆటగాళ్లు ఆడుతూ పాడుతూ విజయం సాధించారు. ఫలితంగా భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి సింగిల్స్‌లో శశికుమార్ ముకుంద్ 6-2, 6-1తో లియోవా (టోగో)పై నెగ్గగా... రెండో సింగిల్స్‌లో రామ్‌కుమార్ 6-0, 6-2తో సెటోడ్జి (టోగో)ను ఓడించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా




'దిల్' రాజు, అనిల్ రావిపూడి, శిరీష్

ఈ సక్సెస్ చాలా పాఠాలు నేర్పింది

-'దిల్' రాజు

''ఇండస్ట్రీలో బడ్జెట్ కాదు.. కథే ముఖ్యం. మేము కూడా కథలని నమ్ముకుని సినిమాలు నిర్మించాం. కొత్త దర్శకులతో తీసినప్పుడు ఎన్ని విజయాలు వచ్చాయో అందరికీ తెలిసిందే. అయితే కాంబినేషన్స్ అంటూ నాలుగైదేళ్లుగా మేం తడబడుతున్నాం. 'సంక్రాంతికి వస్తున్నాం' హిట్‌తో అనిల్ మళ్లీ మాకు ఒక రహదారి వేసి ఇచ్చాడు. ఈ సక్సెస్ నాకు కూడా చాలా పాఠాలు నేర్పించింది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన డిస్ట్రిబ్యూటర్స్ గ్రాటిట్యూడ్ మీట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ-''సాధారణంగా డిస్ట్రిబ్యూటర్స్‌కి బ్రేక్ ఈవెన్ అయితేనే సూపర్ హిట్. అయితే వాళ్లు నష్టపోయినప్పుడు కూడా సినిమా సూపర్ హిట్ పోస్టర్స్ పడుతుంటాయి. 90 శాతం ఫెయిల్యూర్స్, కేవలం 10 శాతం మాత్రమే సక్సెస్ ఉండే ఇండస్ట్రీ ఇది. 20 ఏళ్లుగా మాతో ప్రయాణం చేస్తున్న డిస్ట్రిబ్యూటర్స్‌కి ధన్యవాదాలు'' అని చెప్పారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ- ''సంక్రాంతికి వస్తున్నాం' ఆరు రోజుల్లోనే రూ.100 కోట్లు షేర్ రాబట్టింది. ఓ రీజినల్ ఫిలింకి చూడలేనేమో అనుకున్న రూ. 300 కోట్ల గ్రాస్ నంబర్ మా మూవీతో చూడబోతున్నందుకు హ్యాపీ'' అని తెలిపారు. ''20 ఏళ్ల క్రితం డిస్ట్రిబ్యూటర్‌కి ఉన్న విలువ ఇప్పుడు లేదు. ఇలాంటి సమయంలో వాళ్లు తలెత్తుకునేలా చేసిన సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'' అని శిరీష్ పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూటర్స్ సాయికృష్ణ, రాజేశ్, హరి, శోభన్, ఎల్వీఆర్ మాట్లాడారు.



'తంగలాన్'లో విక్రమ్



'గామి'లో విశ్వక్ సేన్

అరుదైన గౌరవం

విశ్వక్ సేన్ హీరోగా నటించిన 'గామి', విక్రమ్ కథానాయకుడిగా చేసిన 'తంగలాన్' సినిమాలకు అరుదైన గౌరవం దక్కింది. 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025'లో ప్రదర్శనకి ఈ చిత్రాలు ఎంపికయ్యాయి. నెదర్లాండ్స్ వేదికగా ఈ నెల 9 వరకూ జరగనున్న ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారత సినిమాలకు చోటు దక్కడం విశేషం. విశ్వక్ సేన్ హీరోగా, చాందినీ చౌదరి హీరోయిన్‌గా రూపొందిన తెలుగు చిత్రం 'గామి'. ఈ చిత్రంతో విద్యాధర్ కాగిత దర్శకుడిగా పరిచయమయ్యారు. కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రం 2024 మార్చి 8న విడుదలైంది. ఈ సినిమాలో విశ్వక్ సేన్ అఘోరాగా నటించారు. ఆయన నటనకు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులు పడ్డాయి. అదే విధంగా విక్రమ్ హీరోగా నటించిన తమిళ చిత్రం 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మాళవికా మోహనన్, పార్వతీ తిరువోతు కీలక పాత్రల్లో నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా 2024 ఆగస్టు 15న తమిళంతో పాటు తెలుగులోనూ విడుదలైంది. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఈ సినిమాలో మరోసారి తన నట విశ్వరూపం చూపించారు విక్రమ్. ఇక 'గామి, తంగలాన్'లు 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025' ప్రదర్శనకు ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

పల్లెటూరి డిటెక్టివ్



కిశోర్ శ్రీకృష్ణ, తనికెళ్ల భరణి, మిధున ప్రియ

తనికెళ్ల భరణి ప్రధాన పాత్రలో 'అసుర సంహారం' అనే చిత్రం రూపొందనుంది. కిశోర్ శ్రీకృష్ణ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో మిధున ప్రియ కీలక పాత్ర చేయనున్నారు. శ్రీ సాయి ప్రవర్తిక బోయళ్ల సమర్పణలో శ్రీ సాయి తేజో సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సాయి శ్రీమంత్, శబరీష్ బోయళ్ల నిర్మించనున్న ఈ చిత్రాన్ని శనివారం ప్రకటించారు. 'క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ చిత్రాలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలకి ప్రేక్షకాదరణ ఉంటోంది. ఈ క్రమంలోనే విలేజ్ క్రైమ్ డ్రామాగా 'అసుర సంహారం' రూపొందనుంది. ఈ మూవీలో తనికెళ్ల భరణి విలేజ్ డిటెక్టివ్‌గా ఓ విభిన్నమైన పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మిధున ప్రియ, కెమేరా: బాలు ఏబీసీడీ, సంగీతం: కరీం అబ్దుల్.

స్క్రీన్స్ పెరగడం ఆనందం

- విష్ణువర్ధన్



విష్ణువర్ధన్, ఆకాశ్ మురళి, స్నేహ

ఆకాశ్ మురళి, అదితీ శంకర్ జంటగా 'పంజా' ఫేమ్ విష్ణువర్ధన్ దర్శకత్వంలో రూపొందిన తమిళ సినిమా 'నెసిప్పాయ'. ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ జనవరి 14న విడుదలైంది. ఈ సినిమాను 'ప్రేమిస్తావా' టైటిల్‌తో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ జనవరి 31న తెలుగులో విడుదల చేసింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో ఆకాశ్ మురళి మాట్లాడుతూ-''తెలుగు పరిశ్రమకు నన్ను ఆహ్వానించిన ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమా తెలుగు ప్రేక్షకులకూ నచ్చడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''రిలేషన్‌షిప్ నేపథ్యంలో జరిగే రొమాంటిక్ డ్రామా ఇది. ఈ సినిమాలోని క్రైమ్ ఎలిమెంట్ అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తుంది. ఆకాశ్ ప్రతిభగలవాడు. యాక్షన్ స్టంట్స్‌ను కూడా తనే చేశాడు. అదితి అద్భుతంగా నటించింది. 'ప్రేమిస్తావా' సినిమాకు స్క్రీన్స్ పెరుగుతున్నాయని మైత్రీవారు చెప్పడం హ్యాపీగా ఉంది'' అని చెప్పారు విష్ణువర్ధన్. ''ఈ సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు సహనిర్మాత స్నేహ.

సస్పెన్స్



ఆర్పీ పట్నాయక్, సురేష్

రాంప్రసాద్, జెమినీ సురేష్, కిరీటి, సాయి ప్రసన్న, సాయి కిరణ్, నజియా ఖాన్, అద్వైత చౌదరి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'వైఫ్ ఆఫ్ అనిర్వేష్'. గంగ సప్తశిఖర దర్శకత్వం వహించారు. మహేంద్ర గజేంద్ర సమర్పణలో వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించారు. ఈ సినిమా ఎస్‌కేఎంఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా తెలుగులో రిలీజ్ కానుంది. ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు, మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ విడుదల చేసి, మాట్లాడుతూ- ''అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో రూపొందిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మంచి విజయం సాధిస్తుంది'' అన్నారు. వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర మాట్లాడుతూ-''ఓ మిమిక్రీ ఆర్టిస్ట్ తన ఇబ్బందులను తనకు తెలిసిన కళతో ఎలా పరిష్కరించాడు? అనేది దర్శకుడు ఆసక్తిగా తెరకెక్కించారు'' అని తెలిపారు.

సూర్యాపేట్ నేపథ్యంలో....




ఈశ్వర్, నైనా

'కొత్తగా మా ప్రయాణం' మూవీ ఫేమ్ ఈశ్వర్ హీరోగా, నైనా సర్వర్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. రాజేశ్ నాదెండ్ల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అభిమన్యు సింగ్ ప్రధాన పాత్ర పోషించారు. అనిల్‌కుమార్ కాట్రగడ్డ, ఎన్. శ్రీనివాసరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో ఈశ్వర్ మాట్లాడుతూ- ''సూర్యాపేట్ జంక్షన్'కి నేను కథ రాశాను. సూర్యాపేట పరిసరాల్లో జరిగే కథ ఇది. ప్రభుత్వం నుంచి ఉచితాలు తీసుకోవడం వల్ల మధ్య తరగతి ప్రజలు ఎలాంటి ఇబ్బందుల్లో ఇరుక్కుంటున్నారో మా చిత్రంలో చూపిస్తున్నాం'' అన్నారు. ''మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. రోషన్ సాలూరి, గౌర హరి మంచి సంగీతం ఇచ్చారు'' అన్నారు అనిల్ కుమార్.

ఓటీటీ ఇది చూడొచ్చు

చూసి తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో బాలీవుడ్ చిత్రం ది రోషన్స్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఈ జీవితమనే చక్రంలో కొందరి వంతు వస్తుంది, కొందరి వంతు ముగుస్తుంది. ముగిసిన వారి జ్ఞాపకాలు మన మనసులో పదిలంగా ఉంటాయి. వారిలో ఎందరో మహానుభావులుంటారు. వారి జ్ఞాపకాలైతే మనం నెమరువేసుకోవచ్చేమో కానీ ఆ కాలంలో వారు పడ్డ కష్టం, ఆనందం కానీ మనకు తెలియవు. అటువంటి వారి జీవిత చక్రానికి వెండితెర రూపమిస్తే మన ఆనందం అవధులు దాటుతుంది. ఆ కోవకు చెందినదే నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'ది రోషన్స్' టీవీ షో. ఇదో డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి జీవిత చక్రాలకు తెర రూపమే ఈ షో. బాలీవుడ్ దిగ్గజ రోషన్ కుటుంబానికి చెందిన నాటి సంగీత కళాకారులు రోషన్ లాల్ నాగ్రత్ నుండి నేటి తరం నటుడు హృతిక్ రోషన్ వరకు... వారి జీవిత ప్రయాణాన్ని ఎంతో అందంగా చూపించారు ఈ డాక్యుమెంటరీలో. ఓ రకంగా చెప్పాలంటే మనం ఈ షో ద్వారా నాలుగు తరాలు ప్రయాణిస్తాం. ముందుగా రోషన్ కుటుంబం నుండి రోషన్ లాల్ నాగ్రత్ సంగీత ప్రయాణంతో ఈ షో ప్రారంభమై ఆ పై అతని కొడుకు రాజేష్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో సాగి, ఆ తరువాత ఆయన కొడుకు రాకేశ్ రోషన్ నటనా ప్రయాణంతో పాటు ప్రొడ్యూసర్‌గా ఎలా రాణించారు? అన్నది చూపిస్తూ నేటి తరం కథానాయకుడు హృతిక్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో షో ముగుస్తుంది. ఈ షో ద్వారా నాటి బాలీవుడ్ సంగీతం నుంచి నేటి తరం సినిమాల వరకు మనకు తెలియని ఎన్నో రహస్యాలతో పాటు హిందీ చిత్ర పరిశ్రమలోని అప్పటి ఒడిదుడుకులను ఇప్పటి పట్టు విడుపులను సవివరంగా చూపించారు. ఈ రోషన్ కుటుంబానికి బాలీవుడ్ పరిశ్రమలో ఉన్న నాటి, నేటి దిగ్గజాలు తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ప్రేక్షకులకు చెప్పడం మరింత బావుంది. అందుకే 'ది రోషన్స్' చూసి నేర్చుకోదగ్గ, తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ. ఇది ప్రతి సినిమా ప్రేక్షకుడు తమ వ్యక్తిగత లైబ్రరీలో భద్రపరుచుకోదగ్గ డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. వర్త్‌ఫుల్ టు వాచ్.

– ఇంటూరు హరికృష్ణ